ఐటీఐకి..రక్షణేది..?

- ఆక్రమణకు గురవుతున్న స్థలం
- సిమెంట్ దిమ్మెలు, ఇనుప కంచెలు తొలగింపు
- ప్రహరీ లేక తరుచూ చోరీలు
- ప్రతిపాదనలకే పరిమితమైన కొత్త భవనం



ఐటీఐ భవనానికి నెర్రెలువారిన గోడలు

మంచిర్యాలఅర్బన్: పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థుల కోసం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(ఐటీఐ)కి రక్షణ లేకుండాపోతుంది. కోట్లాది విలువైన భూమికి రెండు వైపులా ప్రహరీ లేకపోవటంతో అక్రమార్కులు పాగా వేస్తున్నారు. సిమెంట్ దిమ్మెలు ధ్వంసం చేసి ఇనుప కంచెలు తొలగించి దర్జాగా చొచ్చుకువస్తున్నారు. తరుచూ విలువైన సామగ్రి చోరీ అవుతోంది.

శిథిలావస్థలో భవనం..

మంచిర్యాల ఐటీఐ భవనం శిథిలావస్థకు చేరింది. అయినా గదుల కూల్చివేతపై యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. నెర్రలు బారిన గోడలు.. కూలుతున్న స్లాబ్.. దెబ్బతిన్న ఫ్లోరింగ్‌తో విద్యార్థులు, సిబ్బంది భయంభయంగా చదువులు సాగిస్తున్నారు. కొత్త భవనం నిర్మించాలని ఆర్అండ్‌బీ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. నూతన భవనం మాటెలా ఉన్నా, కొన్ని రోజులు పోతే విలువైనా స్థలం, సామగ్రి మాయమవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ఐదు దశాబ్దాల చరిత్ర..

జిల్లా కేంద్రంలో 1974 జూలైలో ఐటీఐ ఏర్పాటు చేశారు. ఐదు దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ ఐటీఐకి 1990లో నూతన భవనం నిర్మించారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్‌- టర్నర్, ఎలక్ట్రీషియన్ మెకానిక్, మెకానిక్ (మోటార్ వెహికల్), వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగామింగ్ అసిస్టెంట్(కోపా) ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ 392 మంది చదువుకునే అవకాశం కల్పించారు. 30ఏళ్ల క్రితం నిర్మించిన భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. దానిని కూల్చివేయాలని ఆర్అండ్‌బీ శాఖ నివేదిక ఇచ్చింది. రేకులషెడ్లలో నెర్రలుబారిన



గోడల మధ్య చదువులు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. నూతన భవనానికి రూ.13.40 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, వర్క్‌షాపు నిర్మాణానికి ప్రతిపాదనలను కమిషనర్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌కు నివేదించారు. నూతన భవనం ప్రతిపాదనలకే పరిమితమైంది. స్థలం కబ్జా కాకుండా ఐటీఐ చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉంది.

కిటికీలు తొలగించి చోరీలు..

ఐటీఐలో ఇనుప కిటికీలు తొలగించి తరుచూ చోరీలు పాల్పడుతున్నారు. మందు గేట్‌కు తాళం ఉన్నా.. చుట్టూ వేసిన ఇనుప కంచెల (పెన్సింగ్)ను తొలగించి చోరీలకు పాల్పడుతున్నారు. ఐటీఐ ఎలక్ట్రికల్, వెల్డింగ్‌ల్యాబ్‌లో కాపర్ వైర్‌ను చోరీ చేశారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. 28 జాలీల్లో 18 వరకు దొంగతనం కాగా మూడు నాలుగు జాలీలకు దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాత్‌రూంలకు సంబంధించిన నల్లాల పైపులు, డోర్లు ధ్వంసం చేశారు. రాత్రివేళల్లో మద్యం ప్రియులకు అడ్డగా మారింది. పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

శిథిల భవనాల్లో చదువులు

ఐటీఐ కోర్సుల్లో అన్నింటికీ విస్తారమైన ఉపాధి అవకాశాలున్నాయి. పేద, మధ్య తరగతి పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే ఐటీఐ భవనాలు శిథిలమయ్యాయి. తప్పనిసరి పరిస్థితుల్లోనే అందులోనే చదువులు కొనసాగిస్తున్నాం. నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. తరుచూ దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. స్థలం కబ్జాకు గురవుతున్న విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం.

– చందర్, ఐటీఐ ప్రిన్సిపాల్

మిగిలింది ఆరెకరాలే..



సిమెంట్ దిమ్మెలు కూల్చి ఇనుప కంచెలు(ఫెన్సింగ్) తొలగించిన స్థలం

ఐటీఐ స్థలం 18.19 గుంటలకుగాను ప్రస్తుతం ఆరు ఎకరాలు మాత్రమే మిగిలినట్లు తెలుస్తోంది. విద్యుత్‌శాఖ, మున్సిపాలిటీ, రెవిన్యూ శాఖకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని అధికారులు చెబుతున్నారు. ఫెన్సింగ్ తొలగించి చిన్న చిన్న షెడ్లు వేయటం.. ఇసుక డంప్ చేయటంతో ఇటీవల మైనింగ్ అధికారుల దృష్టికి వెళ్లటంతో సీజ్ చేశారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వస్తే ఐటీఐ స్థలం కాపాడడంతోపాటు చోరీలకు అడ్డుకట్ట వేయవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ పోల్స్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ పోల్స్ నిర్మాణం పనులను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళులు

కాసిపేట: ప్రజాయుద్ధనౌక గద్దర్ పోరాటాలు మరవలేనివని ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. మండల కేంద్రంలోని కాసిపేట ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఆదివారం ప్రెస్‌క్లబ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, ప్రజాస్పందన వేదిక కన్వీనర్ సిలోజు మురళి, ప్రెస్‌క్లబ్ సభ్యులు రవిరాజ్, శ్రీధర్, తిరుపతి, రమేష్, అనిల్, మోతీరాం, నాయకులు చిన్న భీమయ్య, దుర్గం గోపాల్, వాసుదేవ్, కళాకారులు గొడిసెల బాపు, రాజన్న, తదితరులున్నారు.

ఆర్థికసాయం

కోటపల్లి: మండలంలోని పుల్లగామ గ్రామానికి చెందిన పొట్టాల సారక్క–తిరుపతిల కుమారుడు విష్ణుకు ఇటీవల తమిళనాడులోని తిరుచనపల్లిలో ఎన్ఐటీలో సీటు సాధించాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఫీజు కట్టలేక ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం అవుతున్నాడనే విషయం తెలుసుకుని ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విష్ణుకు రూ.పదివేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మహేందర్, జెట్టి శ్రీనివాస్, కుమార్, తిరుపతి, సంపత్ పాల్గొన్నారు.

జిల్లా కమిటీలో చోటు

జన్నారం: మోకుదెబ్బ జిల్లా నూతన కమిటీలో జన్నారం మండలానికి చెందిన ముగ్గురికి చోటు కల్పించారు. డివిజన్ అధ్యక్షుడిగా పనిచేసిన వొల్లాల నర్సగౌడ్‌కు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, మండల అధ్యక్షుడిగా పనిచేసిన పొడేటి శ్రీనివాసగౌడ్‌కు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, కవ్వాల్‌కు చెందిన పొడేటి సత్యగౌడ్‌కు జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు అమరవేని నర్సగౌడ్, జిల్లా ఇన్‌చార్జి మొండిగౌడ్ ప్రకటన విడుదల చేశారు.

పరామర్శ



మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్‌కు చెందిన సీనియర్ పాత్రికేయుడు రాధాకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆదివారం నిర్వహించిన దశదిన కర్మకు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో బాల్క ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు రాధాకృష్ణ కుటుంబానికి అందించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ. 60
పచ్చిమిర్చి	60
చిక్కుడు కాయ	60
బీరకాయ	60
వంకాయ	50
కాకరకాయ	60
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	70
సొరకాయ	30
ఆకుగోబి	50
పూగోబి	60
పాలకూర	30
తోటకూర	30
ములక్కాయ	80
గోరుచిక్కుడు	60
బోడకాకర	200

– మంచిర్యాలఅగ్రికల్చర్



ఆధ్యాత్మికం

ఆలయంలో ప్రత్యేక పూజలు



లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామ శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయంలో ఆదివారం విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్లారం పోచమ్మకు మొక్కులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ సమీపంలో చెట్ల కింద వంటావార్పు చేసి భోజనాలు చేశారు.

ఘనంగా వాసవీమాత నవరాత్రోత్సవం



మందమర్రిరూరల్: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో వైశ్యసంఘం ఆధ్వర్యంలో వాసవీమాత నవరాత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మార్కెట్లోని వీధుల గుండా వాసవీమాతా విగ్రహంతో ఊరేగింపు, శోభాయాత్ర నిర్వహించారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. వ్యాపార కమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి విజయ్‌కుమార్, వైశ్యసంఘం నాయకులు గంప ఆంజనేయులు, గడ్డం అనిల్, రామన్న, సతీష్, రామ్మోహన్, శ్రీనివాస్, ఆనందం, సందీప్, రమ్య, మాలతీ తదితరులు ఉన్నారు.

‘కలిసికట్టుగా పని చేస్తే బీజేపీ విజయం తథ్యం’



బెల్లంపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే భగీరథీ మురుల్యా



చెన్నూర్: ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కేశవ్‌ప్రసాద్



మిట్టపల్లి మొగిలి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అభిమన్యు దత్తాత్రేయ పవార్

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి బెల్లంపల్లిలో కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ కర్ణాటక రాష్ట్ర సులియా నియోజకవర్గ ఎమ్మెల్యే భగీరథీ మురుల్యా అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం ‘ఎమ్మెల్యే ప్రవాస్ యోజన’లో భాగంగా నిర్వహించిన అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో చిన్నా,పెద్దా అనే తేడా లేకుండా సమష్టిగా పాటుపడాలన్నారు. బేషజాలకు పోవద్దని సూచించారు. ఐకమత్యంతో మెలిగితే, విజయం సాధించడం తేలికవుతుందని హితబోధ చేశారు. అనంతరం ప్రచార కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అంతకుముందు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే భగీరథీ మురుల్యాకు శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణ దేవరాయలు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, జాయింట్ కన్వీనర్ రాజులాల్ యాదవ్, జిల్లా కార్యదర్శులు గోవర్ధన్, రజిని, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

‘తెలంగాణలో బీజేపీ జెండా ఎగురాలి’

చెన్నూర్: తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని బెంగుళూరు ఎమ్మెల్సీ కేశవ్‌ప్రసాద్ అన్నారు. స్థానిక పద్మశాలీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన బీజేపీ చెన్నూర్ నియోజకవర్గ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అగ్రగామిలో నిలిపారని పేర్కొన్నారు. ప్రపంచదేశాలు భారత్ వైపు చూస్తున్నాయని తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. సమావేశంలో నాయకులు అందుగుల శ్రీనివాస్, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, రాపర్తి వెంకటేశ్వర్, రఘునందన్ రెడ్డి, ఆరుముల్ల పోచం, దీక్షితులు, సుశీల్‌కుమార్, పత్తి శ్రీనివాస్, చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి’

నస్పూర్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మహారాష్ట్ర ఔసా నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభిమన్యు దత్తాత్రేయ పవార్ అన్నారు. ‘ఎమ్మెల్యే ప్రవాస్ యోజన’ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నస్పూర్‌లోని సీసీసీ సింగరేణి గెస్టు హౌజ్‌లో మంచిర్యాల నియోజకవర్గం పరిధిలోని జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీని బలోపేతం చేసేందుకు వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి మొగిళి ఇంటిలో కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్, నాయకులు ముల్కల మల్లారెడ్డి, పానుగంటి మధు, ఆనంద్‌కృష్ణ, ఆకుల అశోక్‌వర్ధన్, వాణి, ప్రభాకర్, మల్లిఖార్జున్, పట్టి వెంకటకృష్ణ, బుద్దె లక్ష్మణ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

దండేపల్లి/జన్నారం: పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని, సంఘం జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు, రాజకీయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. దండేపల్లి, జన్నారం మండల కేంద్రాల్లో ఆదివారం పద్మశాలీ సంఘం నాయకులతో సమావేశమయ్యారు. అఖిల భారత పద్మశాలీ సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో పద్మశాలీ రాజకీయ శంఖారావం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. శంఖారావ సభకు పద్మశాలీ కులస్తులు ఇంటికొక్కరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో జిల్లా నాయకులు సుధాకర్, సదానందం, దండేపల్లిలో దేవయ్య, శంకర్, సత్యం, దేవేందర్, రామస్వామి, లక్ష్మణ్, జన్నారంలో గంగయ్య, సారంగపాణి, దశరథం, వీరయ్య, రాజేశం, బాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో పద్మశాలీ కుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 3వ తేదీన సరూర్‌నగర్ కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో పద్మశాలీ శంఖారావం భారీ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా, మండలంలోని నాయకులు కార్యకర్తలు కుల సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరై సమావేశం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజగురువయ్య, రిజలింగు, కిషన్, చంద్రయ్య, రాజన్న, నాగరాజు పాల్గొన్నారు.

రాయిపేటలో వైద్య శిబిరం

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రాయిపేట గ్రామంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. 52మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 8మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. వైద్యుడు కృష్ణతేజ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.



కార్యాక్రమంలో సర్పంచ్ అమృత, హెచ్ఈవో జగదీశ్, ఏఎన్ఎం నర్సమ్మ, ఆశ కార్యకర్త విజయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ జయంతి

జన్నారం/నస్పూర్/మందమర్రిరూరల్/భీమారం/లక్సెట్టిపేట/రామకృష్ణాపూర్/బెల్లంపల్లి/కాసిపేట: భారత మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ప్రధానిగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పలుచోట్ల కేక్ కట్‌చేసి



భీమారంలో...

పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘హామీల అమలులో విఫలం’

నస్పూర్: సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో టీబీజీకేఎస్ విఫలం అయ్యిందని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘం(బీఎంఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు పేరం రమేశ్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు భీమయ్య, ఏరియా అసిస్టెంట్ సెక్రటరీ వినోద్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేశ్, నాయకులు రామకృష్ణ, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సతీశ్

జైపూర్: మండల యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్వ గ్రామానికి చెందిన కామెర సతీశ్‌కుమార్‌ను నియమించినట్లుగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్ల సంపత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, పీసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాల మేరకు మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ యూత్ నాయకులు కామెర సతీశ్‌ను నియమించినట్లుగా ఆయన పేర్కొన్నారు.

సమ్మెకు మద్దతు

పాతమంచిర్యాల: సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రేంకుమార్ డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్ఎంల సమ్మెకు ఆదివారం మద్దతు ప్రకటించారు. సెకండ్ ఏఎన్ఎంలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

సింగరేణి ఆస్తులు ప్రభుత్వం కొల్లగొడుతోంది

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

బెల్లంపల్లి: సింగరేణి కార్మికులు రక్తాన్ని చెమటగా మార్చి కూడబెట్టిన సంపద, ఆస్తులను బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా కొల్లగొడుతోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. బెల్లంపల్లి బ్రాంచ్ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ 16మహాసభలు ఆదివారం కాల్‌టెక్స్‌లోని శ్రీ వైష్ణవి ఫంక్షన్ హాల్లో జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. సింగరేణిలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, చివరికి మున్సిపల్ ప్రజాప్రతినిధులు సైతం పెత్తనం చేయడానికి సిద్ధపడుతున్నారని విమర్శించారు. ఆర్థికంగా ఎంతో బలీయంగా ఉన్న సింగరేణి, దినదినం ఆర్థిక దోపిడీకి గురవుతోందని ఆరోపించారు. పోరాటాలతోనే సింగరేణి, కార్మికుల భవిష్యత్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు సీనియర్ నాయకుడు సంజీవ్ ఎర్రజెండాను ఎగురవేశారు. సభ ప్రారంభానికి ముందు అమరులకు విప్లవజోహార్లు అర్పించారు.

బ్రాంచి కార్యదర్శిగా దాగం మల్లేష్..

మహాసభలను పురస్కరించుకుని నూతన బ్రాంచి కమిటీని ఎన్నుకున్నారు. బెల్లంపల్లి బ్రాంచి ఏఐటీయూసీ సింగరేణి విభాగం కార్యదర్శిగా దాగం మల్లేష్ రెండోసారి ఎంపికయ్యాడు. ఉపాధ్యక్షుడుగా బియ్యాల వెంకటస్వామి, సహాయ కార్యదర్శిగా దాసరి తిరుపతి గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా డీఆర్ శ్రీధర్, మీనుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, మంతెన రమేష్, బోసు కోశాధికారిగా ఎస్.నాగేశ్వర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 25కార్యవర్గ సభ్యులు, 57 మంది కౌన్సెల్ సభ్యులను ఎంపిక చేశారు. మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కలవేణ శంకర్, అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, డెప్యూటీ జనరల్‌సెక్రెటరీ రాజ్‌కుమార్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, ఏఐటీయూసీ, సీపీఐ శ్రేణులు పాల్గొన్నారు.

‘టీబీజీకేఎస్ నాయకులు పైరవీలకే పరిమితం’

నస్పూర్: టీబీజీకేఎస్ నాయకులు కార్మికుల సమస్యల పరిష్కరించకుండా పైరవీలకే పరిమితమయ్యారని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య అన్నారు. సీసీసీలోని నర్సయ్యభవన్‌లో నిర్వహించిన శ్రీరాంపూర్ బ్రాంచి 12వ మహాసభలో ఆయన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ.. సింగరేణిలో గతంలో 44పైగా అండర్‌గ్రౌండ్ మైన్‌లు ఉండగా, వాటిని ప్రస్తుతం 25కు తగ్గించారని, ఓసీలు రెండు ఉండగా వాటిని 19కి పెంచారన్నారు. బొగ్గు వెలికి తీసేందుకు పర్మినెంట్ కార్మికులనే వినియోగించాల్సి ఉండగా, కాంట్రాక్టు కార్మికులను సైతం బొగ్గు వెలికి తీసేందుకు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 27వరకు గోదావరిఖనిలో నిర్వహించే 16వ రాష్ట్ర మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు నాయకులు పట్టణంలో పలు వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, నాయకులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి స మ్మేళనం అలరించింది. అనంతరం జానపద సాహిత్యంపై సంగీత సా హిత్య సుధా వాహిని వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనాథ్‌గౌడ్ మాట్లాడుతూ జానపదం భాష కంటే పూర్వం పుట్టిందని, ఇది మౌఖికంగా వ్యాప్తి చెందుతూ పండిత పామరులు అలవోకగా పాడుకునే సాహిత్యం అన్నారు. జీవనానుభవ సారమే జానపద సాహిత్యమన్నారు. కార్మిక, శ్రామికుల పనితో పాటే పుట్టిందన్నారు. పండుగలో జాజిరాట, సారదికాండ్లు, బుడుబుక్కలు, హరిదాసులు పాడుకునే పని నిర్దిష్టమైన నియమాలు లేకుండా జనుల నోళ్లను నానే సులభ ప్రక్రియగా అభివర్ణించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు ఆనందర్ రావు, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, సంతోష్, సుగుణాకర్, దక్షిణామూర్తి, నందనకారి సురేష్, సాహితీ సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు పలువురు పాల్గొన్నారు.